ఘనంగా నేత్ర విద్యాలయం ఫౌండేషన్ డే సంబురాలు

ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



వేడుకలను ప్రారంభిస్తున్న చినజీయర్‌స్వామి చిత్రంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్ శివారులో శ్రీరానగరంలో ఉన్న నేత్ర విద్యాలయం 18వ ఫౌండేషన్ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా దేశ గౌరవ విశిష్టతను తెలియజేస్తూ ఆపరేషన్ సిందూర్ బ్యాలెట్‌ను ప్రదర్శించారు. చిన్న జీయర్ స్వామి విద్యార్థులకు మంగళాశాసనాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీ అహోబిల జీయర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న ఆలయ వ్యవస్థాపకుడు రాజారెడ్డి తదితరులు

అత్తాపూర్: అత్తాపూర్ శ్రీ లక్ష్మి నర్సింహ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో గణపతి హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయ వ్యవస్థాపకుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రాహుల్‌గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలి



మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మిని ముందస్తు అరెస్టు చేస్తున్న పోలీసులు

మైలార్‌దేవ్‌పల్లి: బీహార్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్రమోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉడుత లక్ష్మి డిమాండ్ చేశారు. అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసే కార్యక్రమంలో పాల్గొనాలని నిర్ణయించిన మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఉడుత లక్ష్మిని ముందస్తుగా అరెస్టు చేశారు. రాహుల్ వ్యాఖ్యలు ప్రధానమంత్రిని అవమానించడం మాత్రమే కాదు, భారతదేశం మాతృమూర్తుల పట్ల కాంగ్రెస్ పార్టీకి ఉన్న అసభ్యదృక్పథాన్ని స్పష్టంగా చూపిస్తుందన్నారు. పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు గోద పాండుయాదవ్, నేతలు రమేష్‌రెడ్డి, నాగమణి, లక్ష్మి పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



ఓరియంటేషన్ డేలో పాల్గొన్న హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి

బండ్లగూడ: విద్యార్థులు అన్ని రంగాల్లో వస్తున్న ఆధునిక సాంకేతిక అంశాలను అందిపుచ్చుకుంటేనే వారికి ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందని తెలంగాణ కౌన్సిల్ ఫర్ హయ్యర్ ఎడుకేషన్ చైర్మన్ వి.బాలకృష్ణారెడ్డి సూచించారు. లార్డ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఆదివారం ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బాలకృష్ణారెడ్డి జ్యోతి ప్రజ్వాలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు అధునాతన పద్ధతిలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. క్రమ శిక్షణ, పట్టుదలతో అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చన్నారు. నైపుణ్యత కలిగిన విద్య అభ్యసించడంతో మరింత ముందుకు సాగుతారని సూచించారు. కళాశాల చైర్మన్ బాషా మోహియుద్దీన్, సెక్రటరీ రిజ్వాన్ బేగం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

శంషాబాద్ రూరల్: మండలంలోని మల్కారం గ్రామంలో ఆదివారం సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థులు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. గ్రామీణ పని అనుభవం కార్యక్రమంలో భాగంగా డప్పు ర్యాలీతో ఓటర్లకు అవగాహన చేశారు. కుట్టు యంత్రం వినియోగంలో జాగ్రతలు వివరించారు.



మంచిరేవుల అంబేడ్కర్ యూత్ వినాయకుడి పూజలో పాల్గొన్న భక్తులు



మణికొండ శ్రీరాంనగర్ కాలనీ వినాయకుడి వద్ద కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



నార్సింగి ఆనంద పోయెట్రీ వినాయకుడి పూజలో పాల్గొన్న మహిళలు



మణికొండ కేపీఆర్ కాలనీ వినాయకుడి పూజలో పాల్గొన్న మాజీ చైర్మన్ నరేందర్ తదితరులు

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా..

- ఘనంగా గణనాథుడి పూజలు
- జోరుగా అన్నదానాలు
- మహిళల కుంకుమార్చనలు
- పిల్లలకు ఆటల పోటీలు.. బహుమతుల ప్రదానాలు
- మండపాలలో వైద్య, రక్తదాన శిబిరాలు

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలు, ఆలయాలు, బస్తీలలో, ప్రధాన చౌరస్తాలలో ఏర్పాటు చేసిన వినాయకుల వద్ద ఘనంగా పూజలు చేశారు. ఆదివారం సెలవు కావటంతో పెద్ద ఎత్తున అన్నదానాలు, రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు, ఆటల పోటీలు, కుంకుమార్చనలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిభ చూపిన చిన్నారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఆయా కార్యక్రమాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఐక్యత, భక్తిభావాన్ని చాటుకున్నారు. ఆదివారంతో ఐదు రోజుల పూజలు పూర్తి కావటంతో పలు అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలలో ఏర్పాటు చేసిన వినాయకులను ఆటపాటలతో నిమజ్జనాలకు తరలించారు.

– మణికొండ



ఎంజీ పార్కు వినాయకుడి వద్ద చిత్రలేఖనం, చెస్ పోటీలలో బహుమతులు గెల్చుకున్న చిన్నారులు



అలకాపూర్ వినాయక చౌక్ వినాయకుని వద్ద సరస్వతీ పూజలో పాల్గొన్న చిన్నారులు



అలకాపూర్ టౌన్ షిప్ వినాయకుడి వద్ద సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న బాలికలు



మణికొండ ఎంప్లాయీస్ కాలనీ వినాయకుని పూజలో పాల్గొన్న నాయకులు



అలకాపూర్ గేటెడ్ కమ్యూనిటీ వినాయకుడి పూజలో పాల్గొన్న మాజీ చైర్మన్ నరేందర్, ఆల్ కాలనీస్ అధ్యక్షుడు వంశీ, కాంగ్రెస్ నేతలు



ఆప్కో కాలనీలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్‌దాస్‌గౌడ్



పుప్పాలగూడ స్కైలా గేటెడ్ కమ్యూనిటీలో కరెన్సీ గణేశ్...



హైదర్‌గూడలో చిన్నారులు



కోకాపేటలో రక్తదానం చేస్తున్న ఫ్రెండ్స్ యూత్...



హైదర్షాకోట్‌లో మాజీ డిప్యూటీ మేయర్...



పీరంచెరువులో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు



అత్తాపూర్‌లో యువకులు



మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో...

కార్మిక హక్కుల సాధనకు అవిశ్రాంత పోరు

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

మైలార్‌దేవ్‌పల్లి: కార్మిక హక్కులపై సీఐటీయూ సమరశీల పోరాటాలు చేస్తున్నదని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశాన్ని జిల్లా సీఐటీయూ ఉపాధ్యక్షులు జె.రుద్రకుమార్ అధ్యక్షతన కాటేదాన్ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాలడుగు భాస్కర్, జిల్లా గైడ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ 29 కార్మిక చట్టాన్ని రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం కార్మికుల హక్కులను హరించడమే అని అన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ వల్ల కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం పోయి 12 గంటలకు పెరిగిందని రంగారెడ్డి జిల్లాలో అనేక పారిశ్రామిక ప్రాంతంలో కార్మికులతో కంపెనీ యాజమాన్యాలు వెట్టి చాకిరీ చేయిస్తున్నాయన్నారు. స్కీం వర్కర్లైన అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ధ్వజమెత్తారు. వెంటనే స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్, కోశాధికారి కవిత, జిల్లా ఉపాధ్యక్షులు డి.కిషన్, డి.జగదీష్, నర్సిరెడ్డి, అల్లి దేవేందర్, జిల్లా సహాయ కార్యదర్శులు రామ్మోహన్, స్వప్న, వీరయ్య, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నేతల ముందస్తు అరెస్టులు



మణికొండలో ఇందిరను అరెస్టు చేస్తున్న పోలీసులు

మణికొండ: ప్రధాన మంత్రి నరేంద్రమోడీ తల్లి గురించి బీహార్ కాంగ్రెస్ నాయకులు చేసిన అవమానకర వాఖ్యలకు నిరసనగా బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టదలచిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు ముందస్తు అరెస్టులతో నిలువరించారు. బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పిలుపుతో బీజేపీ కార్యాలయానికి వెళ్లాలనుకున్న బీజేపీ మహిళా నాయకులను మణికొండలో ఉదయమే అరెస్టులు చేసి రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సి.హెచ్.ఇందిర మాట్లాడుతూ... ప్రజాస్వామ్య దేశంలో దేశ ప్రధానమంత్రి తల్లి గురించి చెడుగా మాట్లాడిన వారికి నిరసన తెలిపే అవకాశం కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వటం లేదన్నారు. ఇలాంటి ముందస్తు అరెస్టులు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ అధికారం కోల్పోయిందని, రాబోయే రోజుల్లో ప్రజలు కాంగ్రెస్‌కు అదే గతి పట్టిస్తారన్నారు.

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అరెస్టు...

మైలార్‌దేవ్‌పల్లి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ తల్లి మీద అనుచిత వాఖ్యలు చేసిన రాహుల్‌గాంధీ వెంటనే బహిరంగ క్షమాపణలు చేప్పాలని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. అనుచిత వాఖ్యలను నిరసిస్తు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేసే కార్యక్రమానికి వెళ్తున్న క్రమంలో ఆయనను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ముందస్తు హౌస్ అరెస్టు చేశారు.

ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి సహకరించాలి



సభ్యులకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: ఇందిరాగాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో మట్టి తవ్వకాలలో దొరికిన స్వయంభు ఆంజనేయ స్వామి విగ్రహానికి గుడి నిర్మించేందుకు నూతన కమిటీ సభ్యులు సహకరించాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు ఇందిరా గాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ నూతన కమిటీ సభ్యులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సొసైటీలో అమ్మవారి ఆలయం మినహాయించి మిగతా ఎటువంటి దేవుళ్ల విగ్రహాలు లేనందున భవిష్యత్తులో మిగతా దేవుళ్ల నవగ్రహాలు, వినాయకుడు, నాగదేవత, సాయిబాబా, అయ్యప్ప స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు కనీసం వెయ్యి నుంచి రెండు వేల గజాల స్థలం కేటాయించాలన్నారు. ఆంజనేయ స్వామి కృపతో విగ్రహం వెలిసిన చోట గుడి కట్టే కార్యక్రమాన్ని త్వరగా ప్రారంభించాలని కోరారు.

స్కూటీని ఢీకొన్న డీసీఎం

వ్యక్తి దుర్మరణం

శంషాబాద్ రూరల్: రహదారిపై స్కూటీని డీసీఎం ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. తొండుపల్లి శివారులో బెంగళూరు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలివీ... శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్న స్కూటీని వెనుక నుంచి డీసీఎం ఢీకొంది. ఈ ప్రమాదంలో స్కూటీపై ఉన్న వ్యక్తి మృతి చెందాడు. మృతుడి తల వేరు పడగా.. స్కూటీని డీసీఎం చాలా దూరం వరకు ఈడ్చుకెళ్లింది. ఈ ఘటనతో రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

‘భవిష్యత్ నగరం ఎలా ఉండబోతోంది’

వినూత్న చిత్రాలకు వేదికగా కలర్ చాంపియన్ పోటీలు

శంషాబాద్ రూరల్: చార్మినార్ సన్‌గ్లాసులు పెట్టుకుంది.. ఆకాశంలో డ్రోన్ పోలీసులు డ్రోన్ ట్రాఫిక్‌కు కంట్రోలు చేస్తారు.. నిజమైన డైమండ్ ఆభరణంతో నెక్లెస్ రోడ్డు మెరుస్తుంది.. కార్లు గాలిలో ఎగిరి ట్రాఫిక్ జాం అయింది.. భవిష్యతులో గ్లోబల్ వార్మింగ్‌పై విద్యార్థుల ఇలాంటి ఊహా చిత్రాలు ఆహూతులను ఆలోచింపచేశాయి. పట్టణంలోని ఎస్ఆర్ క్లాసిక్ కన్వెషన్‌లో గ్లోబల్ ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం కలర్ చాంపియన్-2025 పోటీలు నిర్వహించారు. నగరంలోని 26 కేంద్రాల నుంచి పాల్గొన్న 570 మంది చిన్నారులు భవిష్యతును ఊహిస్తూ పలు చిత్రాలు గీశారు. ‘నా నగరం హైదరాబాద్ 2050’ అనే థీమ్ నేపథ్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ థీమ్‌లో వినూత్న, వినోదాత్మక ఊహలు రేకెత్తించాయి. ఎగిరే ఆటోలు, రోబో పోలీసులు, డ్రోన్ బిర్యానీలు వంటి అంశాలతో విద్యార్థులు తమ ఊహలకు చిత్ర రూపం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెరిడియన్ స్కూల్ ప్రిన్సిపాల్ శైలజా రెడ్డి, ఎస్‌బీపీ అకాడమీ ఎండీ దినేష్ విక్టర్, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా గణనాథుల నిమజ్జనాలు

- కోకాపేట, నెక్నాంపూర్‌లలో క్రేన్‌ల ఏర్పాటు
- ప్రశాంతంగా సాగుతున్న నిమజ్జన సంబురాలు
- జోరుగా లడ్డూ వేలంపాటలు



తీన్‌మార్ స్టెప్పులతో వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న ఓ అపార్ట్‌మెంట్ వాసులు

మణికొండ: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఐదు రోజులుగా పూజలందుకున్న గణనాథుల విగ్రహాలు ఆదివారం గంగమ్మ ఒడికి చేరాయి. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలో అపార్ట్‌మెంట్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, కాలనీలలో ఏర్పాటు చేసిన వందలాది విగ్రహాలను నిమజ్జనం చేశారు. సాయంత్రం భక్తి శ్రద్ధలతో వినాయకులకు పూజలు నిర్వహించి ఆటోలు, డీసీఎంలు, కార్లు, ద్విచక్ర వాహనాలపై ఆటపాటలు, భజనలు, కోలాటాలతో నెక్నాంపూర్ చిన్న చెరువు, కోకాపేట కొత్త చెరువులలో నిమజ్జనాలను చేశారు. అంతకు ముందు వినాయకుడి చేతులలోని లడ్డూలకు వేలం పాటలు నిర్వహించగా ఆసక్తి ఉన్నవారు వాటిని వేలల్లో వేలం పాడి దక్కించుకున్నారు. నిమజ్జన సాగర్‌లకు తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల సిబ్బంది, అధికారులు ఏర్పాట్లు చేశారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను, భక్తులకు కంట్రోల్ చేశారు. నిమజ్జన సాగర్‌లలో మున్సిపాలిటీల నుంచి ఏర్పాటు చేసిన క్రేన్‌లలో వినాయకులను తీసుకెళ్లి దూరంగా నిమజ్జనం చేశారు. భక్తులు వినాయకుడితో చివరి ఫొటోలు దిగి బైబై గణేశా.. అగ్లే సాల్ జల్దీ ఆనా అంటూ వీడ్కోలు పలికారు. అర్ధరాత్రి వరకు నిమజ్జనాలు ప్రశాంతంగా కొనసాగాయి.



నెక్నాంపూర్ సాగర్‌లో నిమజ్జన దృశ్యం



కోకాపేటలో పోలీసులు, మున్సిపల్ సిబ్బంది



వినాయకుడికి చివరి పూజలు చేస్తున్న భక్తులు



సెల్ఫీ దిగుతున్న మహిళలు



నిమజ్జనానికి తరలివస్తున్న వినాయకులు



బౌరా ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో రూ. 53 వేలకు లడ్డూను దక్కించుకున్న వేణుకుమార్